సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



నేడు అప్పన్న తెప్పోత్సవం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం (నౌకావిహారం) శుక్రవారం సాయంత్రం వరాహ పుష్కరిణిలో జరగనుంది. 8లో



సిటీ ఆర్డినరీగా మెట్రోలు!

నగర పరిధిలో ఎంపిక చేసిన రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్డినరీ సర్వీసులుగా మార్పు చేస్తున్నారు. 8లో



ఆంధ్రా పెరియార్ ఇకలేరు

భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు డాక్టర్ జయగోపాల్(80) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 8లో

న్యూస్‌రీల్

4,006 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న చంద్రానగర్ వైద్యులు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం పిఠాపురంకాలనీ, తోటగరువు, రేసవానిపాలెం(స్వర్ణభారతి), రంగిరీజువీధి, కొబ్బరితోట-1, రైల్వే న్యూకాలనీ, ఏఎస్ఆర్ నగర్, పెదగంట్యాడ, న్యూగాజువాక, చంద్రానగర్-1 తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాల్లో మొత్తం 4,006 మందికి వైద్య సేవలందించారు. ఇందులో ఏడుగురిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు, ఇద్దరిని కంటి చికిత్స కోసం ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫరల్ చేశామని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. పెందుర్తి మండలం రాంపురంలో శుక్రవారం వైద్య శిబిరం జరగనుంది.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

మహారాణిపేట: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. సంవత్సరం నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య పీవో ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు.

అలలపై సయ్యాట

- పర్యాటకులకు సరికొత్త అనుభూతి పంచేలా బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్
- కేరళలో బ్రిడ్జ్‌లను పరిశీలించిన నిపుణులు, అధికారుల బృందం
- సముద్ర అధ్యయన శాస్త్రవేత్తల సూచనలతో సబ్‌మెరైన్ ప్రాంతంలో ఏర్పాటు
- ప్రతికూల వాతావరణాన్ని తట్టుకొనేలా భద్రతా ప్రమాణాలతో నిర్మాణం
- పీపీపీ విధానంలో రూ.కోటితో బ్రిడ్జ్.. తుది దశకు పనులు
- బ్రిడ్జ్ చుట్టూ రెండు పడవలతో గస్తీ, 10 మంది గజ ఈతగాళ్లతో రక్షణ వలయం



నిర్మాణంలో ఉన్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్

విశాఖ సిటీ: అలలపై సయ్యాట ఆడే సమయం ఎంతో దూరంలో లేదు. పర్యాటకలకు సరికొత్త అనుభూతిని పంచే ప్రాజెక్టు త్వరలోనే అందుబాటులోకి రానుంది. కేరళ రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లో ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్.. విశాఖ సాగరతీరంలో కూడా సిద్ధమవుతోంది. సముద్ర అధ్యయన శాస్త్రవేత్తల సూచనలతో.. బీచ్ రోడ్డులో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియానికి సమీపంలో ఫ్లోటింగ్ వీఎంఆర్‌డీఏ అధికారులు బ్రిడ్జ్ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకొనేలా పూర్తి భద్రతా ప్రమాణాలతో పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే ప్రాజెక్టు దాదాపుగా తుది దశకు చేరుకుంది.

పర్యాటకుల భద్రత కోసం..

- సముద్రం అలలకు తగ్గట్టుగానే ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ప్రతిస్పందిస్తుంటుంది.
- దానిపై నడిచే వారు అందుకు తగ్గట్టుగా సరికొత్త అనుభూతిని పొందుతారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.
- పర్యాటకాభివృద్ధి చేపట్టిన ఈ ప్రాజెక్టులో పర్యాటకుల భద్రతపై కూడా వీఎంఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించారు.
- ఫ్లోటింగ్ బ్రిడ్జ్ చుట్టూ రెండు పడవలతో నిర్వాహకులు నిరంతం గస్తీ నిర్వహించనున్నారు.
- సందర్శకుల భద్రత నిమిత్తం 10 మంది గజ ఈతగాళ్లను నియమించనున్నారు.
- వారి పర్యవేక్షణలో మాత్రమే వంతెనపై సందర్శనకు అనుమతిస్తారు.
- ప్రతి సందర్శకుడికి లైఫ్ జాకెట్ అందజేస్తారు. అది ధరించకపోతే అనుమతించరు.
- అలాగే బ్రిడ్జ్ చుట్టూ లైఫ్‌గార్డులను రక్షణ వలయంగా ఉంటారు.
- మరో వారం రోజుల్లో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది.
- ఆ తరువాత పూర్తి స్థాయిలో పరిశీలన అనంతరమే సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

పీపీపీ విధానంలో..

విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రపంచ పర్యాటకలను ఆకర్షించే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంట్, హిల్‌టాప్ రిసార్ట్, గ్లాస్ బ్రిడ్జ్, ఫ్లోటింగ్ బ్రిడ్జ్ వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా గ్లోబర్ టెండర్లను ఆహ్వానించింది. ఇందులో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ టెండర్‌ను సాయి మోక్షా షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ దక్కించుకుంది. వీఎంఆర్‌డీఏకు ఏడాదికి రూ.15.3 లక్షలు ముందస్తు చెల్లింపుల ప్రతిపాదికన ఈ ప్రాజెక్టును చేపట్టింది.

శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలతో..

వాస్తవానికి ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను తెన్నేటి పార్క్ వద్ద ఏర్పాటు చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు భావించారు. అయితే ఆ ప్రాంతం అటవీ శాఖకు



చెందినది కావడంతో అక్కడ విరమించుకున్నారు. రుషికొండ ప్రాంతంలో బ్రిడ్జ్ నిర్మాణంపై వీఎంఆర్‌డీఏ అధికారులు ఆంధ్రా యూనివర్సిటీలో సముద్ర అధ్యయన, భూభౌతిక శాస్త్రవేత్తలను సంప్రదించారు. రుషికొండలో ప్రాణాంతకమైన రిప్ కరెంట్ అధికంగా ఉంటుందని, ప్రాజెక్టుకు సానుకూలం కాదని చెప్పారు. అలాగే కురుసుర మ్యూజియం ఉత్తర దిశ ప్రాంతం ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌కు అనుకూలమైనదని సూచించారు.

కేరళలో వంతెనలను సందర్శించి..

దేశంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో మాత్రమే ఉన్నాయి. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారుల బృందం కేరళ రాష్ట్రంలోని కాలికట్ వద్ద బేపూర్ తీరంలోను, త్రిశూర్ నగరంలో చావక్కడ్ తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌లను సందర్శించారు. అధికారులు, నిర్మాణ, నిర్వహణదారులతో మాట్లాడి అక్కడ ప్రాజెక్టు విధానాలు తెలుసుకున్నారు. కేరళలో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌లు ప్రపంచ పర్యాటకలకు విశేషంగా ఆకట్టుకుంటున్న విషయాన్ని గమనించారు. ఏర్పాటు చేసిన ప్రతి చోటా విజయవంతంగా నడుస్తున్నట్లు గుర్తించారు.

పూర్తి భద్రతా ప్రమాణాలతో..

- **సబ్‌మెరైన్ మ్యూ**జియం ప్రాంతానికి సమీపం**లో పూర్తి భ**ద్రతా ప్రమాణాలతో బ్రిడ్జ్‌ను **ఏర్పాటు చేస్తున్నా**రు.
- **ముంబయి** నుంచి వచ్చిన ఫ్లోటింగ్ బ్రిడ్జ్ **నిర్మాణ నిపుణులతో** ప్రతికూల వాతావరణాన్ని **సైతం తట్టుకొనే**లా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు.
- **ఒకేసారి 200** మంది సామర్థ్యాన్ని తట్టుకొ**నేలా బలమైన** యాంకర్లతో పటిష్ఠంగా హెచ్**డీపీఈ బ్లాక్‌లతో** బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతున్నారు.
- మొత్తం 100 మీటర్లు ఉండే ఈ బ్రిడ్జ్‌లో 20 మీటర్లు తీరం ఒడ్డున, 80 మీటర్లు సముద్రంపై ఉంటుంది.
- తాత్కాలిక నిర్మాణమైన ఈ బ్రిడ్జ్‌లో వినియోగించిన బ్లాకులు, యాంకర్లు, ఇతర సామగ్రి పూర్తిగా పర్యావరణ సానుకూలమైనవి.

శాస్త్రీయ అధ్యయనం చేసి..



శాస్త్రీయ అధ్యయనం చేసి ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌కు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయడం జరిగింది. పర్యాటకాభివృద్ధికే కాకుండా సందర్శకుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాం. పూర్తి భద్రతా ప్రమాణాలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతి అందించాలన్న ఉద్దేశంతో పీపీపీ విధానంలో బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ కమిషనర్

విశాఖ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..



ప్రతిపక్షాలు, పచ్చ మీడియా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఒక వైపు కోర్టు కేసులు, అవాస్తవ కథనాలు రాసి అడ్డుకుంటూనే మరోవైపు అభివృద్ధి జరగడం లేదని తప్పుడు ఆరోపణ చేస్తున్నాయి. విశాఖలో పర్యాటకాభివృద్ధికి వీఎంఆర్‌డీఏ శాస్త్రీయ అధ్యయనం చేసిన తరువాత ప్రాజెక్టులను చేపడితే వాటిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖలో అభివృద్ధిని చూసి ఓర్వలేక బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు, పచ్చ మీడియా ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటన్నింటినీ అధిగమించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను మెట్రో నగరాలకు ధీటుగా అభివృద్ధి చేస్తారు.

– ఎం.వి.వి.సత్యనారాయణ, విశాఖ ఎంపీ

మహా క్రీడా సంబరం

విశాఖ సిద్ధం

- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా తుది పోటీలు
- రైల్వే స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం
- ఐదు క్రీడాంశాల్లో తలపడనున్న 26 జిల్లాల జట్లు



ప్రారంభ వేడుకకు సిద్ధమైన రైల్వే స్టేడియం

విశాఖ స్పోర్ట్స్: మహా క్రీడా సంబరానికి విశాఖ సర్వం సిద్ధమైంది. గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి చేరుకుంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా.. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలకు మరికొన్ని గంటల్లో తెరలేవనుంది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. చెన్నై సూపర్ కింగ్స్, ప్రో కబడ్డీ జట్లకు శిక్షణాపరమైన సహకారం అందించిన నిపుణులు ఈ పోటీలను వీక్షించేందుకు రానుండటంతో మరింత ప్రాధాన్యం నెలకొంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఎంపిక చేసి, వీరితో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

40 బస్సులు సిద్ధం : జిల్లా స్థాయిలో విజయం సాధించిన జట్లు ఇప్పటికే విశాఖ చేరుకున్నాయి. ప్రతీ జిల్లా నుంచి 134 మంది చొప్పున మెన్, వుమెన్ పోటీలకు హాజరవుతున్నారు. రైళ్లలో కొందరు, బస్సుల్లో మరికొందరు విశాఖలో ఏర్పాటు చేసిన బస ప్రాంతానికి చేరుకున్నారు. రైళ్లలో వచ్చిన వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లో బస వద్దకు చేర్చారు. ఐదు రోజుల పాటు క్రీడాకారులను బస ప్రాంతం నుంచి మైదానాల వద్దకు తరలించేందుకు 40 బస్సులను సిద్ధం చేశారు.

జేసీపీ పర్యవేక్షణలో భద్రత : మెన్ జట్లకు దబ్బంద, వుమెన్ జట్లకు సుద్దగెడ్డ, కొమ్మాదిలోని టిడ్కో గృహాల్లో వసతి సౌకర్యం కల్పించారు. మహిళలకు ఏర్పాటు చేసిన బస వద్ద జాయింట్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో భద్రత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం ప్రారంభ వేడుక జరగనుండగా.. మధ్యాహ్నం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం వసతి కల్పించిన చోటే అందిస్తారు. మధ్యాహ్న భోజనం క్రీడా ప్రాంగణాల వద్ద అందజేయనున్నారు. పోటీలు జరిగే సమయంలో క్రీడాకారులకు స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వసతి ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. మొబైల్ టాయిలెట్లు సిద్ధం చేశారు.

పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు ఇవే..

జిల్లా స్థాయిలో మెన్ విభాగం క్రికెట్ పోటీల్లో నక్కవానిపాలెం, బ్యాడ్మింటన్‌లో సుసర్ల కాలనీ-1 జట్టు, వాలీబాల్‌లో ప్రశాంతినగర్, కబడ్డీలో ఓల్డ్ అయ్యన్నపాలెం, ఖోఖోలో సాకేత్‌పురం-1 జట్లు విజేతలుగా నిలిచాయి. మహిళా విభాగం క్రికెట్‌లో వాంబే కాలనీ-6, బ్యాట్మింటన్‌లో పెదవాల్తేర్-2, వాలీబాల్‌లో రజకవీధి-1, కబడ్డీలో లాసన్స్‌బే కాలనీ, ఖోఖోలో లంకెలపాలెం జట్లు విజేతలుగా నిలిచి.. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు ఇలా..

క్రీడ	ప్రథమ	ద్వితీయ	తృతీయ
క్రికెట్	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2లక్షలు
వాలీబాల్	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2 లక్షలు
కబడ్డీ	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2లక్షలు
ఖోఖో	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2 లక్షలు
బ్యాడ్మింటన్	రూ.2లక్షలు	రూ.లక్ష	రూ.50వేలు

మైదానాలు ఇవే..

రాష్ట్ర స్థాయిలో పోటీ పడేందుకు 1,482 మంది పురుషులు,1,482 మంది మహిళలు విశాఖ తరలివచ్చారు. పోటీలకు నగరంలోని మైదానాలను సిద్ధం చేశారు.

వుమెన్ క్రికెట్	వైఎస్సార్ జీ గ్రౌండ్
మెన్ క్రికెట్	రైల్వే స్టేడియం, ఏఎంసీ మైదానం, కొమ్మాది కె.వి.కె స్టేడియం
కబడ్డీ, ఖోఖో	ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం
వాలీబాల్	ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానం
బ్యాడ్మింటన్	జీవీఎంసీ ఇండోర్ స్టేడియం

మధురవాడలో 243 గదులు కేటాయింపు



పింక్ మొబైల్ టాయిలెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్

మధురవాడ: మధురవాడ సుద్దగెడ్డ వద్ద టిడ్కో ఇళ్ల సముదాయంలో మహిళా క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలను గురువారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీవో భాస్కరరెడ్డి, జీవీఎంసీ ఏడీసీ వై.శ్రీనివాస్, డీసీఆర్ ఎస్.శ్రీనివాస్ పరిశీలించారు. ఇక్కడ 26 జిల్లాల మహిళా జట్లకు వసతి కల్పిస్తున్నారు. ఇందుకోసం 243 గదులు కేటాయించారు. భోజనం, తాగునీరు, వసతి, రక్షణ కోసం 100 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. వైద్యులు, పారిశుధ్య సిబ్బంది, ప్లంబర్, విద్యుత్ తదితర సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు. భీమిలి జెడ్సీ శైలజా వల్లి ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రాకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడా సంబరానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. కలెక్టరేట్‌లో పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లకు ఆనందపురం మండలం దబ్బంద, మధురవాడ పరిధిలోని సుద్దగెడ్డ టిడ్కో గృహాలు, ఏయూ హాస్టళ్లలో వసతి కల్పించినట్లు తెలిపారు. బస చేసిన ప్రాంతం నుంచి నుంచి క్రీడా ప్రాంగణానికి చేరుకునేందుకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 9న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా పోటీలు ప్రారంభిస్తారని, 13న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఫకీరప్ప తెలిపారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన కేంద్రాల్లో ఏడీసీపీ హోదా అధికారిని నియమించి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. అన్ని చోట్లా మహిళా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు.

విద్యాలయాలకు.. పరిశ్రమలకు వారధిగా..

- నేడు నగరంలో నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024

సాక్షి, విశాఖపట్నం : పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మధ్య ఉన్న నైపుణ్య లోటును భర్తీ చేసేందుకు వారధిగా నిలిచేందుకు ప్రభుత్వ సహకారంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇండస్ట్రీ 4.0 పేరుతో నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024 నగరంలో శుక్రవారం ప్రారంభం కానుంది. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డా.మల్లికార్జునతో పాటు పారిశ్రామికవేత్తలు, వివిధ రాష్ట్రాల స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు హాజరుకానున్నారు. పటిష్టమైన వ్యవస్థని నిర్మించి.. ఏపీలో యువతకు దేశ విదేశాల్లో అపారమైన అవకాశాలు కల్పించేందుకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కృషి చేస్తోందని సంస్థ ఎండీ, సీఈవో డా.వినోద్ తెలిపారు. ఈ సదస్సు పలు ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన వివరించారు.

రాజ్యసభలోనూ ఉత్తరాంధ్రకే పెద్దపీట

- వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావుకు అవకాశం




సాక్షి విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఉత్తరాంధ్ర పక్షపాతి అని నిరూపించారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైతే అందులో రెండు ఉత్తరాంధ్రకే అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. దీనిపై ఉత్తరాంధ్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైవీ సుబ్బారెడ్డి..

వైవీ సుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా మేదరమెట్ల. తల్లిదండ్రులు ఎర్రం చిన్నపోలిరెడ్డి, పిచ్చమ్మ. షోలాపూర్‌లో భారతీ విద్యాపీఠ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ పూర్తి చేశారు. 2014 సాధారణ ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా విజయం సాధించి 16వ లోక్‌సభలో అడుగుపెట్టారు. పరిశ్రమల స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా, ప్రైవేట్ బిల్లుల, తీర్మానాల కమిటీలో సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాల(ఎంపీ ల్యాడ్స్) కమిటీ, ఆర్థిక కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కాన్సులేటివ్ కమిటీలో సభ్యుడిగా పని చేశారు. ప్రత్యేక హోదా కోసం 2018లో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2019 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీలోనూ పలు పదవులు నిర్వర్తించారు. గతంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

విశ్వసనీయతకు గుర్తింపు

విధేయత, విశ్వసనీయతకు గుర్తింపుగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. గ్రూప్-1 అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన బాబూరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. అక్కడ 30 ఏళ్ల టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురు వేశారు. కొద్ది నెలలకే వైఎస్సార్ దుర్మరణం పాలవ్వడంతో తదనంతర పరిణామాల్లో జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీని స్థాపించారు. జిల్లాలో బాబూరావు ఒక్కరే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జగన్ వెంట నడిచారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో అమలాపురం ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో తిరిగి పాయకరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

సత్తా చాటిన వారికి ప్రత్యేక తర్ఫీదు



శాప్ ఎండీ ధ్యాన్‌చంద్

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నీలో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ధ్యాన్‌చంద్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లను గురువారం పరిశీలించిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా తుది పోటీల్లో ఐదు క్రీడాంశాలకు నగరంలోని మైదానాలు సిద్ధం చేసినట్లు ఎండీ తెలిపారు. నాలుగు మైదానాలు క్రికెట్, మిగిలిన నాలుగు మైదానాలను ఒక్కో క్రీడ కోసం సిద్ధం చేశామని, క్రీడాకారుల వసతి కోసం రెండు వేదికలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. రైల్వే స్టేడియంలో శుక్రవారం ఉదయం రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, స్థానిక మంత్రులు ఈ పోటీలు ప్రారంభిస్తారని చెప్పారు.

ఎవరు ఎవరితో.. : జిల్లా జట్ల సమక్షంలోనే ఎవరు ఎప్పుడు ఎక్కడ ఆడేది నిర్ణయిస్తామని ఎండీ ధ్యాన్‌చంద్ తెలిపారు. ఎంపిక చేసిన 500 మంది వరకు టెక్నికల్ అఫీషియల్స్ సమక్షంలోనే ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఫైనల్‌గా తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లతో పాటు నగదు ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి చేతులమీదుగా అందిస్తామన్నారు. వైఎస్సార్ స్టేడియంలో 13వ తేదీన ముగింపు సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఐపీఎల్(చెన్నై సూపర్‌కింగ్స్), ప్రోకబడ్డీ, వాలీబాల్ తదితర మెగా ఈవెంట్లలో ప్రత్యేకత సంతరించుకున్న వారిని రప్పించి ఆడుదాం ఆంధ్రాలో సత్తా చాటిన ఆటగాళ్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.

10న రాష్ట్ర సమాచార కమిషనర్ రాక

మహారాణిపేట: రాష్ట్ర సమాచార కమిషనర్ పి.జె. శ్యాముల్ ఈ నెల 10న విశాఖ వస్తున్నారు. గుంటూరు నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో 10న ఉదయం 7.10 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. 10 గంటలకు ఏయూకు చేరుకుని.. అక్కడ వివిధ విభాగాల అధికారులతో సమీక్ష చేస్తారు. రాత్రి 10.35 గంటలకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి గుంటూరు వెళతారు.

సిటీ ఆర్డినరీగా మెట్రోలు!

- కొన్ని సర్వీసులు మార్పు
- ఇకపై అన్ని స్టేజిల్లోనూ ఆపేలా చర్యలు
- త్వరలో ప్రత్యేకంగా స్కూల్ బస్సులు



ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్

సాక్షి, విశాఖపట్నం: తెల్ల ఏనుగుల్లా మారిన ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రయాణికులకు దూరమవుతున్నాయి. నిబంధనల ప్రకారం వీటి హాల్టులు పరిమితం కావడమే కాదు.. సిటీ ఆర్డినరీ బస్సులతో పోల్చుకుంటే వీటి టికెట్ చార్జీలు భారమవుతున్నాయి. పైగా ఈ బస్సులు ఖాళీగా వెళ్తున్నా స్టేజిల్లో ఆగడం లేదని, దిగాల్సిన స్టేజిల్లో హాల్ట్ లేక ఆపడం లేదని ఫిర్యాదులు ప్రయాణికుల నుంచి ఎక్కువ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. నగర పరిధిలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కొన్ని ఎంపిక చేసిన రూట్లలో తిరుగుతున్న సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్డినరీ సర్వీసులుగా మార్పు చేస్తున్నారు. దీంతో ఇవి ఆయా రూట్లలోని అన్ని స్టేజిల్లోనూ ఆగుతున్నాయి. అంతేకాదు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లతో పోల్చుకుంటే వీటి టికెట్టు చార్జీ తక్కువగానూ ఉంటోంది. ఫలితంగా ఇవి ప్రయాణికుల ఆదరణ చూరగొంటూ వారికి చేరువవుతున్నాయి. ప్రస్తుతం స్టీల్ సిటీ నుంచి ద్వారకా బస్‌స్టేషన్ (సర్వీస్ నంబరు 38కె)కు ఐదు, రైల్వే స్టేషన్–తగరపువలస (222 ఆర్) మధ్య ఐదు, స్టీల్ సిటీ–తగరపువలస (111) మధ్య ఐదు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. వీటిలో ఇప్పటివరకు పది బస్సులను సిటీ ఆర్డినరీ సర్వీసులుగా మార్పు చేశారు. దీంతో ఈ బస్సులు అన్ని స్టేజీల్లోనూ ఆగుతూ ప్రయాణికుల అవసరాలు తీరుస్తున్నాయి. త్వరలో మరికొన్ని మెట్రోలను ఆర్డినరీలుగా మార్పు చేయనున్నారు. మరోవైపు ఈ నెలలో విశాఖపట్నం జిల్లాకు 20 వరకు కొత్త సూపర్ లగ్జరీ బస్సులు వస్తున్నాయి. ఇప్పటి వరకు నడుస్తున్న కిలోమీటర్ల పరిమితి పూర్తయిన 20 పాత సూపర్ లగ్జరీలను కూడా సిటీ ఆర్డినరీ బస్సులుగా మార్పు చేస్తున్నట్టు విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. కేవలం సిటీ పరిధిలో తిరిగే కొన్ని మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను మాత్రమే సిటీ ఆర్డినరీ బస్సులుగా మార్పు చేస్తున్నామని, విజయనగరం, చోడవరం, యలమంచిలి రూట్లలో తిరిగే మెట్రోలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు

నగర పరిధిలో పలు విద్యాసంస్థలున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న బస్సులు వీరి అవసరాలు తీర్చడం లేదు. ఉదయం స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే వారు, సాయంత్రం తిరుగు ప్రయాణంలో వచ్చే వారు పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ఆ సమయాల్లోనే రాకపోకలు సాగిస్తుండడంతో ఇటు విద్యార్థులు, అటు ఉద్యోగులు, ప్రయాణికులకు అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కొన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇలా జూన్‌లోపు 15 స్కూల్/కాలేజీ బస్సులను ప్రత్యేకంగా కేటాయించనున్నారు.

జాకీలు విరిగిపోతున్నాయి...

- టీడీపీ, జనసేనపై మంత్రి ఆర్‌కే రోజా కామెంట్
- మోసం చేసైనా అధికారంలోకి రావాలన్న తాపత్రయం బాబుది
- మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకునేందుకు బాబు ఢిల్లీ వెళ్లారు



విమానాశ్రయంలో మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు, అధికారులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చంద్రబాబు నాయుడ్ని, లోకేష్‌ని జాకీలు పట్టుకుని లేపాలని చూస్తున్నా.. అవి విరిగిపోతున్నాయని కానీ ఉపయోగంలేకుండా పోతుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. విశాఖలో శుక్రవారం నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన కలిసి వచ్చినా.. విడివిడిగా వచ్చినా తమకు ఇబ్బంది లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఫలానా మంచి చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేదన్నారు. అందుకే వారు ఏసీ రూమ్‌ల్లో ప్రెస్‌మీట్లకే పరిమితమయ్యారన్నారు. చంద్రబాబు నాయుడు ఊసరవెల్లిలాగా ఎలా రంగులు మారుస్తున్నాడో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అధికార కాంక్షతో ఒక సారి కాంగ్రెస్‌తో, మరో సారి బీజేపీతో సిగ్గు లేకుండా పొత్తు పెట్టుకొని ఎంత దిగజారిపోతున్నాడో అందరూ గమనిస్తున్నారు.

తిరుపతికి వచ్చినప్పుడు అమిత్‌షా కారుపైన రాళ్లు, చెప్పులు ఏవిధంగా వేయించాడో అందరూ గుర్తు పెట్టుకున్నారు. ఇప్పటికైనా నేను తప్పు చేశాను ఇకనైనా నాకు అవకాశమివ్వండి ఇది చేస్తా, అది చేస్తానని ఒక భరోసా కల్పించే ఆలోచన ఆయనకు లేదన్నారు. ఎంతసేపు జగన్ మోహన్‌రెడ్డిని తిట్టడం, ఆయన మీద విషం చిమ్మటం లేదా సోనియా గాంధీ, అమిత్‌షా, మోదీ కాళ్లు పట్టుకోవడం చేస్తున్నాడని విమర్శించారు. ఇలాంటి మనిషి తమ చిత్తూరు జిల్లాలో పుట్టినందుకు ప్రజలంతా సిగ్గు పడుతున్నారన్నారు. తాను నగరి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఆమెతో ఆంధ్రప్రదేశ్ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి విశాఖ చేరుకున్నారు. వీరికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



యువకులను సురక్షితంగా తీసుకొచ్చిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది/డాబాగార్డెన్స్: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో కొట్టుకుపోతున్న ఇద్దరు యువకులను లైఫ్ గార్డ్స్ కాపాడారు. హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు యువకులు గురువారం సాయంత్రం ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులంతా సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో సతీష్ (29), సహన్ కుమార్(32) కొట్టుకుపోయారు. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, చిన్నప్పన్న, ఎం.అప్పారావు వెంటనే స్పందించి.. వారిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో స్నేహితులంతా ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. కాగా.. యువకుల ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్‌లను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో అభినందించారు. ఈ నెల 2న బిహార్ పర్యాటకులను, 4న నగరానికి చెందిన రాధిక అనే మహిళను లైఫ్‌గార్డ్స్ కాపాడారని గుర్తు చేశారు. నగర పరిధిలోని బీచ్‌ల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, వాటిని గమనించకుండా పర్యాటకులు, సందర్శకులు సముద్రంలోకి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. సముద్రంలో స్నానం చేసేటప్పుడు లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి తీర ప్రాంతం వరకు జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్‌ను నియమించిందని వివరించారు.

ఆంధ్రా పెరియార్ ఇకలేరు

- భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు జయగోపాల్ కన్నుమూత
- 52 ఏళ్ల పాటు మత, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం



జయగోపాల్ పార్థివదేహాన్ని ఏఎంసీకి అప్పగిస్తున్న అతని కుటుంబ సభ్యులు

ఆరిలోవ/మహారాణిపేట: భారత నాస్తిక సమాజం(బానాస) వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత, ఆంధ్రా పెరియార్‌గా పేరు గాంచిన డాక్టర్ జయగోపాల్(80) అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో జయగోపాల్ 1972లో ఫిబ్రవరి 13న నాస్తిక సమాజం ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు మరో ఎనిమిది రాష్ట్రాల్లో నాస్తిక, హేతువాద ఉద్యమ వ్యాప్తి కోసం విశేష కృషి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలిచి ఉద్యమాలు చేపట్టారు. 52 ఏళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల, మత, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి వాటి నిర్మూలనకు కృషి చేశారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపట్టారు. నాస్తిక సమాజంలో ఆయన కృషికి గానూ అంతర్జాతీయ బ్రేవ్ మైండ్ అవార్డును అందుకుని.. దేశంలోనే మొదటి వ్యక్తిగా నిలిచారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్, భౌతికవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం కోసం అనేక రచనలు చేశారు. ఈ నేపథ్యంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్(ఎస్ఎస్ఎఫ్) సంస్థను స్థాపించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఆరిలోవ దుర్గాబజార్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన భార్య రెండేళ్ల కిందట కోవిడ్‌తో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కోరిక మేరకు కళ్లను ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి, పార్థివదేహాన్ని ఏఎంసీకి కుటుంబ సభ్యులు అప్పగించారు.

నేడు అప్పన్న తెప్పోత్సవం

- ముస్తాబైన వరాహ పుష్కరిణి
- వేణుగోపాలస్వామి అలంకారంలో దర్శనమివ్వనున్న అప్పన్న



వేణుగోపాలస్వామి అలంకరణలో అప్పన్న(ఫైల్)

సింహాచలం: పుష్యబహుళ అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తెప్పోత్సవం(నౌకావిహారం) శుక్రవారం సాయంత్రం కొండదిగువ వరాహ పుష్కరిణిలో జరగనుంది. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు సింహగిరి నుంచి కొండ దిగువకు మెట్లమార్గంలో తీసుకొస్తారు. కొండదిగువన ఉన్న పుష్కరిణి వద్ద హంస వాహనంపై స్వామిని వేంజేపచేసి సాయంత్రం 5.30 గంటల నుంచి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొస్తారు. అక్కడ సర్వజనమనోరంజని వాహనంపై స్వామిని అధిష్ఠించి రాత్రి అడవివరం గ్రామంలో గ్రామ తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం రాత్రి స్వామిని తిరిగి సింహగిరికి చేరుస్తారు.

విజయవంతంగా ట్రయల్ రన్

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధం చేసిన హంసాకార తెప్పపై గురువారం సాయంత్రం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించారు. తెప్పపై పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం వరకు వెళ్లి తెప్ప సామర్థ్యాన్ని పరిశీలించారు. గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్ఐలు అప్పలరాజు, రామకృష్ణ, శ్రీనివాసరావు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని అన్నిశాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. తెప్పని హంసాకృతిలో తీర్చిదిద్దామన్నారు. తెప్ప ఫిట్‌నెస్‌ను ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే పరిశీలించి సర్టిఫికెట్ అందించారన్నారు. పుష్కరిణి వద్ద దేవస్థానం తరఫున 10 మంది గజ ఈతగాళ్లను, రెండు అదనపు బోట్లను, లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అలాగే అడవివరానికి చెందిన మరో 15 మంది గజఈతగాళ్లు కూడా సేవలందిస్తారన్నారు. అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. పుష్కరిణిగట్టుపై పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వందమందితో పోలీస్ బందోబస్తు

5వేల మంది వరకు భక్తులు తెప్పోత్సవం తిలకించేందుకు వస్తారని అంచనా వేసినట్లు నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. వంద మంది వరకు లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ పోలీసులు తెప్పోత్సవం బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పుష్కరిణి గట్టుపై గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో భక్తులంతా తోపులాటలు లేకుండా వాటిల్లో కూర్చుని తిలకించాలని సూచించారు. సీసీ కెమెరాలతోపాటు బారికేడర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉత్సవం జరిగే సమయంలో విద్యుత్‌కోత లేకుండా చేయాలని ఏపీఈపీడీసీఎల్‌ను కోరినట్టు తెలిపారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా స్టేషన్ల మధ్య స్పెషల్ రైళ్లు (వయా దువ్వాడ మీదుగా) నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- ఎర్నాకుళం–బ్రహ్మపూర్(06087) అన్ రిజర్వుడు స్పెషల్ మార్చి 2, 9, 16, 23, 30వ తేదీల్లో (శనివారాలలో) ఎర్నాకుళంలో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–ఎర్నాకుళం(06088) అన్ రిజర్వుడు స్పెషల్ మార్చి 4, 11, 18, 25వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.07గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.40గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.
- తాంబరం–సంత్రగచ్చి (06079) స్పెషల్ రైలు తాంబరంలో ఈ నెల 14, 21వ తేదీల్లో (బుధవారాలలో) మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 2.35 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.45 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సంత్రగచ్చి–తాంబరం(06080) స్పెషల్ సంత్రగచ్చిలో ప్రతీ గురువారాలలో ఈనెల 15, 22వ తేదీల్లో రాత్రి 11.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.55గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.35గంటలకు తాంబరం చేరుకుంటుంది.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పీఎం పాలెం: ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విద్యార్థిని తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అందించిన వివరాల ప్రకారం.. పాడేరు సమీపంలోని కిండంగికి చెందిన యు.కోటేశ్వరరావు గ్రామంలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అతని కుమార్తె (16) మారికవలసలోని ఓ ప్రైవేట్ కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. తోటి విద్యార్థినులు వేధింపులకు గురిచేయడంతో గురువారం తెల్లవారు జామున తాను పడుకున్న మంచం పై నుంచి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. పెద్ద శబ్దం రావడంతో తోటి విద్యార్థినులు లేచి ఉరి బిగియకముందే చున్నీని తప్పించి కాపాడారు. కళాశాల నిర్వాహకులు వెంటనే స్పందించి మధురవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తోటి విద్యార్థినులు సకాలంలో స్పందించడం వల్ల తమ కుమార్తెకు ప్రాణాపాయం తప్పిందని విద్యార్థిని తండ్రి కోటేశ్వరరావు తెలిపారు.

HDFC BANK HDFC బ్యాంక్ లిమిటెడ్

బ్రాంచ్: HDFC బ్యాంక్ లిమిటెడ్, డి.నం.10-50-19/1, 1వ మరియు 2వ అంతస్తు, సౌదామణి, వాల్తేరు మెయిన్ రోడ్డు, WNS ఎదురుగా, సిరిపురం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530003, టెలిఫోన్: 0891-6480799/ 1800-2100018 - CIN L65920MH1994PLC080618 - వెబ్‌సైట్: www.hdfcbank.com

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద

HDFC బ్యాంక్ లిమిటెడ్ (17 మార్చి 2023 తేదీగల ఉత్తర్వు ప్రకారం గౌరవ NCLT- ముంబయిచే ఆమోదించబడిన విలీన పథకం ద్వారా HDFC బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైన ఇంతకుముందరి HDFC లిమిటెడ్) యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు (HDFC) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు చట్టంలోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ నోటీసులు జారీ చేసి సంబంధిత డిమాండ్ నోటీసు/ నోటీసులలో తెలిపిన మొత్తాలను దిగువ తెలిపిన వివరాల ప్రకారం సంబంధిత నోటీసు/నోటీసుల తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయ ప్రతినిధి (లు)లను కోరారు. సదరు రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(లు) యొక్క సంబంధిత చివరిగా తెలిసిన సంబంధిత చిరునామాల ప్రెమిసెస్‌లో ఈ నోటీసులు అతికించడానికి దిగువ సంతకందారుకు తప్పనిసరైంది. సదరు రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(లు) దిగువ సంతకందారు నుంచి సంబంధిత నోటీసుల కాపీలను పొందాలనుకుంటే ఏ పనిరోజునైనా సాధారణ కార్యాలయ వేళల్లో సంబంధిత కాపీని పొందవచ్చును. పై నోటీసుకు సంబంధించి, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 60 రోజులలోగా HDFC కు తమ పేర్లకు ఎదురుగా తెలిపిన దిగువ మొత్తాలను సదరు డిమాండ్ నోటీసులలో వివరించిన విధంగా కాలమ్ (సి)లో తెలిపిన సంబంధిత తేదీల నుండి చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా వసూలయ్యేంత వరకు సదరు రుణగ్రహీత(లు) కుదుర్చుకున్న రుణ ఒప్పందం మరియు ఇతర డాక్యుమెంట్లు/ పత్రాలతో అంగీకరించిన విధంగా 18% వంతున తదుపరి వడ్డీతో చెల్లించవలసినదిగా సదరు రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(లు)లకు మరోసారి తెలియజేయడమైనది. బకాయి రుణం తిరిగి చెల్లించుటకు సెక్యూరిటీగా సదరు రుణగ్రహీత(లు) వరుసగా HDFCకు దిగువ సెక్యూర్డ్ ఆస్తి (ఆస్తులు) తనఖాపెట్టారు.

సెక్యూర్డ్ ఆస్తి/ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ 8లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(లు)లను కోరడమైనది.

క్ర. సం.	రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(ల) పేర్లు	చెల్లించవలసిన మొత్తం బకాయిలు	డిమాండ్ నోటీసు తేది	సెక్యూర్డ్ ఆస్తులు/ స్థిరాస్తి (స్థిరాస్తులు) వివరణ
(a)	(b)	(c)	(d)	(e)
1	శ్రీ బలుసు వెంకట జానకిరామయ్య (రుణగ్రహీత) శ్రీమతి బలుసు కుసుమ (సహ-రుణగ్రహీత)	31 డిసెంబర్ 2023* నాటికి రూ.32,79,423/- (ముప్పైరెండు లక్షల డెబ్బై తొమ్మిది వేల నాలుగువందల ఇరవైమూడు రూపాయలు మాత్రమే)	30 జనవరి 24	విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం పరిధిలోని గుర్రంపాలెం గ్రామంలోని సర్వే నం. 144/8, 15, 16, 17, 20 ద్వారా కవర్‌చేయబడిన ప్లాట్ నం.లు 7 మరియు 8 కలిగిన 900 చ.అ. ప్లింత్ ఏరియాతో ఆర్సీసీ స్లాబ్ ఇంటితోపాటు 186.66 చ.గజాలు లేదా 156.072చ. మీటర్ల విస్తీర్ణంగల సైట్ యావత్తు. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం. 6 దక్షిణం: ఉగ్గిన అప్పలనాయుడు మరియు ఇతరులకు చెందిన సైట్, పశ్చిమం: శ్రీమతి అల్లం జయలక్ష్మికి చెందిన సైట్, ఉత్తరం: 20 అడుగుల రోడ్డు.
2	శ్రీ తుతిక నాగరాజా (రుణగ్రహీత) శ్రీమతి తుతిక శివలక్ష్మి (సహ-రుణగ్రహీత)	31 డిసెంబర్ 2023* నాటికి రూ.15,46,879/- (పదిహేను లక్షల నలభైఆరు వేల ఎనిమిదివందల డెబ్బైతొమ్మిది రూపాయలు మాత్రమే)	30 జనవరి 24	విశాఖపట్నం జిల్లా, గోపాలపట్నం ఎస్సార్వో పరిధి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేపగుంట గ్రామంలోని సర్వే నం.124పి ద్వారా కవర్‌చేయబడిన ప్లాట్ నం.లు 28, 27 మరియు 35డి కలిగిన "బాలాజీ గార్డెన్స్" (నార్త్ ఎక్స్‌టెన్షన్) ఏరియా వద్ద గల "సాయి బాలాజీ సౌధ"లోని డోర్ నం.14-473/15, అసెస్‌మెంట్ నం.100010/10525 కలిగిన 707.54 చ.గజాల మొత్తం విస్తీర్ణంలో 417.30 చ.గజాల అవిభాజ్య మరియు అనిర్దిష్ట వాటాతో 49.21 చ.గజాలు లేదా 41.145 చ.మీటర్ల విస్తీర్ణం గల సైట్‌తోపాటు నాల్గవ అంతస్తులో 1295 చ.అ. విస్తీర్ణం గల పూర్తయ్యే దశలో ఉన్న ఫ్లాట్ నం. 503 (కామన్ ఏరియాలు సహా) మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో 70 చ.అ. కార్ పార్కింగ్ యావత్తు మరియు మొత్తం ఆస్తి సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.లు 29, 30 లోని సాయిసింహాద్రి రెసిడెన్సీ గ్రూప్ ఇల్లు, దక్షిణం: ప్లాట్ నం.5 కలిగిన NSTL ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన సర్వే నం. 124చే కవరు చేయబడిన సైట్, పశ్చిమం: ప్లాట్ నం. 35సి కలిగిన శ్రీ బొరోతు సింహాద్రికి చెందిన ఆస్తి, ఉత్తరం: 30 అ. వెడల్పు రోడ్డు. నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నం. 503 సరిహద్దులు: తూర్పు: ఖాళీ సెట్‌బ్యాక్ ప్రదేశం, దక్షిణం: ఖాళీ సెట్‌బ్యాక్ ప్రదేశం, పశ్చిమం: మెట్లు మరియు కామన్ కారిడార్, ఉత్తరం: లిఫ్ట్ మరియు ఖాళీ సెట్‌బ్యాక్ ప్రదేశం.
3	శ్రీ నమ్మి శ్రీనివాస రావు (రుణగ్రహీత) శ్రీమతి నమ్మి రమాదేవి భువనేశ్వరి (సహ-రుణగ్రహీత) శ్రీమతి గుళ్ల వెంకట భువనేశ్వరి (సహ-రుణగ్రహీత)	31 డిసెంబర్ 2023* నాటికి రూ.22,79,690/- (ఇరవై రెండు లక్షల డెబ్బైతొమ్మిది వేల ఆరువందల తొంభై రూపాయలు మాత్రమే)	30 జనవరి 24	విశాఖపట్నం రిజిస్ట్రేషన్ ఉప జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చైతన్యనగర్ ఏరియా వద్ద గల మద్దిలపాలెం గ్రామంలోని టి.ఎస్.నం.54/13 ద్వారా కవర్‌చేయబడిన డోర్ నం.53-20-10, పాత అసెస్‌మెంట్ నం.46500/3341, కొత్త అసెస్‌మెంట్ నం.1086114822, ఎలక్ట్రికల్ సర్వీస్ కనెక్షన్ నం. 112419M042287015 కలిగిన 105 చ.గజాలు లేదా 87.79 చ.మీటర్ల విస్తీర్ణం గల సైట్‌తో పాటు 800 చ.అ. ప్లింత్ ఏరియాతో మొత్తం గ్రౌండ్‌ఫ్లోర్, 800 చ.అ. ప్లింత్ ఏరియాతో మొత్తం మొదటి అంతస్తు, 800 చ.అ. ప్లింత్ ఏరియాతో మొత్తం రెండవ అంతస్తుతో ఆర్సీసీ స్లాబ్ మరియు సరిహద్దులు: తూర్పు: నమ్మి ఈశ్వరరావు ఇల్లు, దక్షిణం: జి.ఎస్.రెడ్డి ఇల్లు, పశ్చిమం: 3 అడుగుల సిమెంట్ రోడ్డు, ఉత్తరం: 3 అడుగుల సిమెంట్ రోడ్డు.

*వర్తించు విధంగా సాలీనా 18% వంతున తదుపరి వడ్డీ, చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా వసూలయ్యేంతవరకు అయ్యే ఆనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవి.

సదరు రుణగ్రహీతలు పైన తెలిపిన విధంగా HDFCకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, సదరు రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(లు)ల బాధ్యత, ఖర్చులు మరియు పరిణామాలపైన సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించు నిబంధనల క్రింద పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి (ఆస్తులు)/ స్థిరాస్తి (స్థిరాస్తులపై) HDFC ముందుకు కొనసాగుతుంది.

HDFC ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి(ఆస్తులు)/ స్థిరాస్తి(స్థిరాస్తులు)లతో అమ్మకం, లీజు, ఇతరత్రా ఏ విధంగానైనా బదిలీ చేయటానికి సదరు చట్టం క్రింద సదరు రుణగ్రహీత(లు)/ న్యాయవారసుడు(లు)/ న్యాయప్రతినిధి(లు) నిరోధించబడినారు. ఏ వ్యక్తి అయినా సదరు చట్టంలోని నిబంధనలను లేదా దాని క్రింద రూపొందించిన నిబంధనలను ఉల్లంఘిస్తే, లేదా ఉల్లంఘించేందుకు ప్రేరేపిస్తే చట్టం క్రింద ఏర్పాటు చేసిన విధంగా కారాగార శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడుటకు బాధ్యులవుతారు.

తేది: 09-ఫిబ్రవరి-2024
ప్రదేశం: విశాఖపట్నం

HDFC బ్యాంక్ లిమిటెడ్ తరపున
సం/- అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: HDFC బ్యాంక్ హౌస్, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ పరేల్ (వెస్ట్) ముంబయి-400020